నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, ఆదివారం 31 డిసెంబర్ 2023 | NALGONDA

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికపై కసరత్తు

ఫిబ్రవరి 6వరకు ఓటర్ల నమోదు

ఏప్రిల్ 4 నాటికి తుది ఓటర్ల జాబితా

జూన్ 8లోపు ఉప ఎన్నిక పూర్తికి ఎలక్షన్ కమిషన్ సన్నాహాలు

ఓటర్ల నమోదుపై రాజకీయ పార్టీల దృష్టి

నల్లగొండ ప్రతినిధి, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన నల్లగొండ – వరంగల్ – ఖమ్మం జిల్లాల పట్టభద్రుల శాసనమండలి స్థానానికి ఉప ఎన్నిక కోసం కసరత్తు మొదలైంది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర ఎన్నికల సంఘానికి శుక్రవారం లేఖ రాయడంతో ఉప ఎన్నిక తెరపైకి వచ్చింది. కేంద్ర ఎన్నికల సంఘం లేఖ సారాంశం ప్రకారం ఫిబ్రవరి 6వరకు ఓటర్ల నమోదుకు అవకాశం కల్పించారు. ఏప్రిల్ 4నాటికి తుది ఓటర్ల జాబితా ప్రకటించడంతో పాటు జూన్ 8 నాటికి ఉప ఎన్నిక ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉన్నది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల నమోదు కీలకం కావడంతో రాజకీయ పార్టీలు రంగంలోకి దిగేందుకు సన్నాహకాలు చేస్తున్నాయి.

నల్లగొండ – వరంగల్ – ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఉన్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి జనగామ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందడంతో తన ఎమ్మెల్సీ పదవికి ఈ నెల 9న రాజీనామా చేశారు. దీంతో 2027 మార్చి 29వరకు మిగిలిన పదవీ కాలం పూర్తి చేయడం కోసం ఈ ఉప ఎన్నిక జరుగనుంది. ఈ క్రమంలో ఉప ఎన్నిక నిర్వహణపై దృష్టి సారించిన కేంద్ర ఎన్నికల సంఘం.. రాష్ట్ర ఎలక్షన్ కమిషన్‌కు ఎన్నికల నిర్వహణపై ఆదేశాలిచ్చింది. తొలి దశలో ఓటర్ల నమోదుకు శ్రీకారం చుట్టాలని, ఇందుకు సంబంధించి శనివారం ఓటరు నమోదుపై పబ్లిక్ నోటీసు జారీ చేయాలని సూచించింది. దీని ప్రకారం ఫిబ్రవరి 6 వరకు అర్హులైన పట్టభద్రుల నుంచి ఓటు కోసం దరఖాస్తులు స్వీకరించనుంది. ఈ ఏడాది నవంబర్ 1నాటికి డిగ్రీ పూర్తయి మూడేండ్లు నిండిన వారందరూ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. దరఖాస్తులను పరిశీలించి ఫిబ్రవరి 21న ఓటర్ల ముసాయిదా జాబితాను విడుదల చేస్తారు. ఈ జాబితాపై మార్చి 14 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. వాటిని పరిష్కరించి ఏప్రిల్ 4న తుది ఓటర్ల జాబితా పూర్తి చేయాల్సి ఉన్నది. అనంతరం ఉప ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేయనున్నారు. జూన్ 8వరకు ఉప ఎన్నిక పూర్తి చేసేలా కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు ఇచ్చింది. ఉప ఎన్నికపై పబ్లిక్ నోటీసుతో ప్రధాన రాజకీయ పార్టీలు, బరిలో నిలువాలనుకుంటున్న అభ్యర్థులు పూర్తి స్థాయిలో రంగంలోకి దిగేందుకు సిద్ధమవుతున్నారు. కొత్త జిల్లాల ప్రకారం.. నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి, ఖమ్మం, కొత్తగూడెం భద్రాద్రి, వరంగల్ అర్బన్, రూరల్, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, ములుగు, జనగాం జిల్లాలలోపాటు సిద్దిపేట జిల్లాలోని మూడు మండలాలతో ఈ నియోజకవర్గం విస్తరించి ఉన్నది. ఈ స్థానంలో 2007 నుంచి ఇప్పటి వరకు నాలుగు సార్లు ఎన్నికలు జరుగగా.. అన్ని సార్లు బీఆర్ఎస్ అభ్యర్థులే విజయం సాధించారు. మరోసారి గులాబీ జెండా ఎగురవేసేందుకు ఆ పార్టీ సన్నద్ధమవుతున్నది. కాంగ్రెస్, బీజేపీ కూడా దృష్టి సారించనున్నాయి. 35 అసెంబ్లీ నియోజకవర్గాలతో ముడిపడి ఉన్న ఉప ఎన్నిక కావడంతో అందరూ ప్రతిష్టాత్మకంగానే తీసుకోవచ్చని భావిస్తున్నారు.

గత ఎన్నికల్లో 5,05,565 మంది ఓటర్లు

2021 మార్చిలో జరిగిన ఎన్నికల్లో 5,05,565 మంది ఓటర్లుగా నమోదయ్యారు. తుది జాబితా ప్రకటించే నాటికి 4,91,396 మంది ఓటర్లుగా నమోదు కాగా, అప్పట్లో నామినేషన్ల స్వీకరణ నాటికి అవకాశం కల్పించడంతో అదనంగా 14,169 మంది ఓటర్లు చేరారు. 2015 మార్చిలో జరిగిన ఎన్నికల్లో 2,81,138 మంది ఓటర్లుగా ఉన్నారు. 2015తో పోలిస్తే 2021 మార్చి నాటికి 2,24,427 మంది అదనంగా ఓటర్లు చేరారు. ప్రస్తుత ఉప ఎన్నికల్లో ఎంత మంది ఓటర్లుగా నమోదవుతారనేది ఆసక్తికరంగా మారింది. అయితే.. షెడ్యూల్ ప్రకారం ఆరేండ్లకోసారి ఎన్నిక జరుగుతుంది. ఎన్నిక జరిగిన ప్రతి సారీ పట్టభద్రులంతా కొత్తగా ఓటు నమోదు చేసుకోవాల్సిందే. 2021 మార్చిలో మొత్తం ఓటర్లలో పురుషులు 3,32,634 మంది, మహిళా ఓటర్లు 1,72,864, ట్రాన్స్‌జెండర్లు 67 మంది ఉన్నారు. అప్పట్లో అత్యధికంగా నల్లగొండ జిల్లాలో 90,826 మంది, ఖమ్మంలో 87,172, వరంగల్ అర్బన్ జిల్లాలో 66,379 మంది ఉండగా.. అతి తక్కువగా ములుగు జిల్లాలో 10,323 మంది ఓటర్లు ఉన్నారు. సిద్దిపేట జిల్లాలోని మూడు మండలాలు ఇందులో ఉండగా 3,584 మంది ఇక్కడ ఓటర్లుగా నమోదయ్యారు. 2021 మార్చిలో జరిగిన ఎన్నికల్లో 74శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 5,05,565 మంది ఓటర్లకు గాను 3,74,117 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2015 ఎన్నికల్లో 54.62 శాతం మాత్రమే ఓట్లు పోలయ్యాయి.

రేషన్ డీలర్ల నియామకాలకు నోటిఫికేషన్

- **నల్లగొండ డివిజన్‌లో 20 ఖాళీలు**

నల్లగొండ, డిసెంబర్ 30 : నల్లగొండ డివిజన్‌లోని 20 గ్రామాల్లో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ల పోస్టుల భర్తీకి అర్డీఓ రవి శనివారం నోటిఫికేషన్ జారీ చేశారు. చిట్యాల మండలంలోని వట్టిమర్తి, తాళ్లవెల్లెంల, వేంబాయి, కనగల్ మండలంలోని తుర్కపల్లి, లచ్చుగూడెం, కట్టంగూర్ మండలంలోని ఊదులూరు, నారగూడెం, పామనుగుండ్ల, యరసానిగూడెం, కేతేపల్లి మండలంలోని ఇనుపాముల, నకిరేకల్ మండలంలోని చందుపట్ల, తాటికల్, నల్లగొండ మండలంలోని పానగల్, నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు, శాలిగౌరారం మండలంలోని అంబారిపేట, ఊట్కూరు, ఉప్పలంచ, తిప్పర్తి మండలంలోని అనిశెట్టి దుప్పలపల్లి, రామలింగాలగూడెం, రాజుపేట గ్రామాల్లో ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. అర్హత ఉన్నవారు రిజర్వేషన్ల వారీగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సంబంధిత గ్రామంలో నివసిస్తూ పదో తరగతి అర్హత ఉండి 18 నుంచి 40ఏండ్ల వయసు వారు, ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఏ ఇతర వ్యాపారాలు లేనివారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. జనవరి 12న నల్లగొండలోని ఆర్డీఓ కార్యాలయంలో రాత పరీక్ష నిర్వహించి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

ఈ కేవైసీ ఇక్కట్లు

- ఇంటి వద్దకు వెళ్లి చేయాల్సిన బాధ్యత గ్యాస్ నిర్వాహకులదే
- గడువు అంటూ లేదు.. నిత్యం నిర్వహించే ప్రక్రియ
- అవగాహన కల్పించని గ్యాస్ ఏజెన్సీలు
- ఆధార్‌తో లింక్ చేసుకుంటేనే రూ.500కు సిలిండర్ వస్తుందని పుకార్లు
- ఈ కేవైసీ చేసినా, చేయకపోయినా.. సబ్సిడీ వర్తింపు
- ప్రజాపాలన దరఖాస్తుల నేపథ్యంలో అప్‌డేట్ కోసం గ్యాస్ ఏజెన్సీల వద్ద కష్టమర్ల బారులు

గ్యాస్ కనెక్షన్‌కు ఈకేవైసీ చేసుకోవడానికి ఏజెన్సీల వద్ద వినియోగదారుల క్యూ

నల్లగొండలో హెచ్‌పీ గ్యాస్ ఆఫీస్ వద్ద బారులుతీరిన వినియోగదారులు

నల్లగొండ, డిసెంబర్ 30 : గృహ వినియోగ గ్యాస్ సిలిండర్‌కు సబ్సిడీ రావాలంటే.. ఈకేవైసీ చేయించుకోవాలని, మహిళల పేరుతో కనెక్షన్ ఉండాలనే అపోహ ఉన్నది. దీంతో వినియోగదారులు వారం రోజులుగా గ్యాస్ ఏజెన్సీల వద్ద బారులు దీరుతూ ఇక్కట్లు పడుతున్నారు. పనులన్నింటినీ వదిలేసి ఉన్న పళంగా ఏజెన్సీల వద్దకు పోయి రోజంతా లైన్‌లో ఉండి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పురుషులతోపాటు మహిళలు కూడా క్యూలో ఉండి తిండితిప్పలు మాని ఈకేవైసీ చేయించుకుంటున్నారు. అయితే.. ఈకేవైసీ అనేది నిత్యం నిర్వహించే ప్రక్రియ. పైగా గ్యాస్ ఏజెన్సీలే వినియోగదారుల ఇండ్లకు వెళ్లి చేయాల్సి ఉన్నది. కానీ.. ఈ విషయంపై వినియోగదారులకు అవగాహన కల్పించడం లేదు. మరోవైపు కేవైసీ చేసినా, చేయకపోయినా ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలు ఆగిపోయే అవకాశం ఉండదు. ఈ విషయాన్ని గ్యాస్ ఏజెన్సీలు చెప్పకుండా తమ ఆఫీస్ వద్దనే ఆయిల్ కంపెనీలు ఇచ్చిన టాస్క్ పూర్తి చేస్తున్నాయి. దాంతో కష్టమర్లు పొద్దంతా ఏజెన్సీల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

అప్‌డేట్ చేయకపోతే సబ్సిడీ రాదని రూమర్

'రాష్ట్ర ప్రభుత్వం త్వరలో రూ.500కే సిలిండర్ ఇస్తుంది. దీనికి గ్యాస్ ఏజెన్సీల వద్ద ఎల్‌పీజీ వినియోగదారులు తప్పనిసరిగా ఈకేవీసీ చేయించుకోవాలి. పురుషుల పేరు మీద కాకుండా మహిళల పేరు మీద గ్యాస్ కనెక్షన్ ఉంటేనే సబ్సిడీ డబ్బు వస్తుంది.' అని తప్పుడు ప్రచారం జరుగుతుండడంతో ఈకేవైసీ చేసుకోవడానికి వినియోగదారులు గ్యాస్ ఏజెన్సీల వద్ద క్యూ కడుతున్నారు. అయితే.. ఈకేవైసీ అనేది కేంద్రం ఆదేశాల మేరకు నిత్యం నిర్వహించే ప్రక్రియ. అసలు వినియోగదారు ఉన్నారా.. లేరా? ఉంటే ఎవరు.. ఆయన ఆధార్, ఫోన్ నంబర్ వివరాలు తీసుకొని అప్‌డేట్ చేపట్టాలి. ఈ ప్రక్రియను గ్యాస్ ఏజెన్సీలకు కేంద్రం ఆదేశానుసారం ఆయిల్ కంపెనీలు ఇచ్చిన టాస్క్. దీన్ని గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులే వినియోగదారుడి ఇంటి కి వెళ్లి ఉచితంగా పూర్తి చేయాలి. ఇందుకోసం ఆయిల్ కంపెనీలు గ్యాస్ ఏజెన్సీలకు ఏఈపీఎస్ అనే అప్‌డేట్ మిషన్‌ను అందజేశాయి. ఈ మిషన్లను గ్యాస్ డెలివరీ బాయ్స్ కు ఇవ్వాల్సి ఉండగా.. వారి వద్దే ఉంచుకొని ఏజెన్సీల వద్దకు వస్తున్న వినియోగదారుల ఈకేవైసీ చేస్తున్నారు. దాంతో కష్టమర్లు వారం రోజులుగా ఆయా ఏజెన్సీల కార్యాలయాల వద్ద బారులు దీరుతున్నారు.

ప్రజా పాలన నేపథ్యంలోనే..

ఈ నెల 28నుంచి జనవరి 6వరకు ప్రజా పాలన కార్యక్రమం నడుస్తుంది. ఇందులో ప్రభుత్వ ఆదేశానుసారం అధికార యంత్రాంగం మహాలక్ష్మి పథకం కింద గ్యాస్ సబ్సిడీ కోసం గ్యాస్ కనెక్షన్ నెంబర్‌ను అడిగారు. దీన్ని సాకుగా చూపి గ్యాస్ కనెక్షన్‌కు ఈకేవైసీ చేస్తేనే సబ్సిడీ సిలిండర్ వస్తుందని రూమర్ తీసుకొచ్చారు. పైగా పురుషుల పేరుతో కనెక్షన్ ఉంటే సబ్సిడీ రాదని.. మహిళల పేరు మీదనే ఉండాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారు. దీంతో ఇప్పటికే పురుషుల పేరు మీద కనెక్షన్ ఉన్నప్పటికీ మహిళల పేరు మీద మరో కనెక్షన్ తీసుకుంటున్నారు. ప్రజా పాలన దరఖాస్తులోని అంశాలపై అధికారులకే క్లారిటీ లేకపోవడంతో ఈ ఇబ్బందులు వస్తున్నట్లు కొందరు అధికారులు అంటున్నారు. గ్యాస్ ఏజెన్సీ వద్దకు వచ్చే వారికి ఈకేవైసీ చేయకుండా ఆపితేనే ప్రజల ఇక్కట్లు తప్పనున్నాయి.

ఈ కేవైసీ నిరంతర ప్రక్రియ..

గ్యాస్ కనెక్షన్ తీసుకున్న వారు ఉన్నారా.. లేరా? లేకుంటే వారి పేరుమీద ఈ కనెక్షన్ ఇంకా ఎవరైనా అక్రమంగా వినియోగిస్తున్నారా.. అనే కోణంలో కేంద్ర ప్రభుత్వం ఈకేవైసీ చేయించాలి. ఏటా ఆయిల్ కంపెనీలను ఆదేశిస్తుంది. వారు గ్యాస్ ఏజెన్సీల ద్వారా ఈ ప్రక్రియ చేపడుతారు. ఇది నిరంతర ప్రక్రియ. అయితే.. ప్రస్తుతం జరుగుతున్న ప్రజా పాలన కార్యక్రమం నేపథ్యంలో గ్యాస్ సబ్సిడీ కోసం ఈకేవైసీ తప్పనిసరి అనే రూమర్ బయటకు వచ్చి ప్రజా ఇబ్బందులకు కారణం అయ్యింది. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ ఈకేవైసీ చేసుకున్నా, చేసుకోకపోయినా ఆగదు అనేది ఆయిల్ కంపెనీలు స్పష్టం చేస్తున్నాయి. ఇదిలా ఉండగా ఈకేవైసీని ఆన్‌లైన్ లో ఇండియన్ ఆయిల్ కంపెనీ పేరుతో ఉండే యాప్‌లో వినియోగదారులే చేసుకోవచ్చు.

గ్యాస్ ఏజెన్సీల వద్దకు రాకండి

ఈకేవైసీ కోసం వినియోగదారులు గ్యాస్ ఏజెన్సీల వద్దకు రావద్దు. గ్యాస్ బుక్ చేసుకున్న తర్వాత డెలివరీ కోసం వచ్చిన వారే మీ గ్యాస్ కనెక్షన్, ఆధార్, ఫోన్ నెంబర్‌తో ఈకేవైసీ చేస్తారు. గ్యాస్ కంపెనీల నిర్వాహకులు ఈ విషయాన్ని వినియోగదారులకు చెప్పాలి. అధికారులకు తెల్వకుండా వచ్చే రూమర్లను నమ్మొద్దు.

– వెంకటేశ్వర్లు, డీఎస్ఓ, నల్లగొండ

ఈ కేవైసీ చేసుకోకున్నా సబ్సిడీ ఆగదు

ఈకేవైసీ అనేది కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నిత్యం నిర్వహించే ప్రక్రియ. దీనికి రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు సంబంధం లేదు. అయినా గ్యాస్ కంపెనీలకు సంబంధించిన డెలివరీ బాయ్స్ వినియోగదారులకు సిలిండర్ డెలివరీ చేసేటప్పుడే ఏఈపీఎస్ మిషన్‌తో ఈకేవైసీ చేయాలి. ఇందుకోసం ఏ ఒక్క వినియోగదారుడూ గ్యాస్ ఏజెన్సీల వద్దకు రావాల్సిన అవసరం లేదు. ఈకేవైసీ చేసినా. చేయకపోయినా ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ మాత్రం ఆగదు. ఈ విషయాన్ని గ్యాస్ ఏజెన్సీలు వినియోగదారులకు చెప్పాలి.

– యువ వశిష్ఠ హెచ్‌పీసీఎల్ సేల్స్ ఆఫీసర్, నల్లగొండ

ఈ కేవైసీ పేరుతో అక్రమ వసూళ్లు

రూ.200 తీసుకొని పైపు అంటగడుతున్న ఏజెన్సీలు

మిర్యాలగూడ, డిసెంబర్ 30 : గ్యాస్ కనెక్షన్ ఈకేవైసీ పేరుతో ఏజెన్సీల వారు అక్రమాలకు పాల్పడుతున్నట్లు వినియోగదారులు పేర్కొంటున్నారు. ఈకేవైసీ కోసం ఏజెన్సీ ఆఫీసుల వద్దకు వెళ్లే వారి నుంచి రూ.200 తీసుకొని పైపును అంటగడుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం నల్లగొండ జిల్లాలో అందజేసిన 68,295 ఉజ్వల గ్యాస్ కనెక్షన్ లబ్ధిదారులు ఈకేవైసీ చేయించుకోవాలని ఆదేశాలు వచ్చాయి. ఈ క్రమంలో మిర్యాలగూడ పట్టణంలో గ్యాస్ ఏజెన్సీల వద్ద లబ్ధిదారులు బారులు దీరుతున్నారు. ఇదే అదునుగా భావించిన ఏజెన్సీల నిర్వాహకులు లబ్ధిదారుల వద్ద బలవంతంగా రూ.200 తీసుకొని గ్యాస్ పైపును అంటగడుతున్నారు. తమకు అవసరం లేదని కష్టమర్లు చెప్పినా వినడం లేదు. పైపు తీసుకుంటేనే ఈకేవైసీ చేస్తామని కొర్రీలు పెడుతున్నారు. తన భర్త వెంకట్‌రెడ్డి ఇటీవల మృతిచెందగా.. గ్యాస్ కనెక్షన్‌ను తన పేరు మీదికి మార్చాలని మిర్యాలగూడ పట్టణంలోని అశోక్‌నగర్‌లోని ఓ ఇండేన్ గ్యాస్ ఏజెన్సీకి వెళ్తే వెయ్యి రూపాయలు వసూలు చేశారని వేములపల్లి మండలానికి చెందిన ఎన్.పుష్పమ్మ వాపోయింది. గ్యాస్ ఏజెన్సీల అక్రమ దోపిడీని నివారించాలని, బలవంతంగా పైపులు అంటగడుతున్న ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

రూ.200 ఇస్తేనే చేస్తున్నారు

నాకు ఉజ్వల పథకం గ్యాస్ కనెక్షన్ ఉంది. ఈకేవైసీ చేయించుకోవాలని శుక్రవారం అశోక్‌నగర్ గ్యాస్ ఆఫీసుకు వచ్చాను. రూ.200 ఇచ్చి పైపు కొంటేనే ఈకేవైసీ చేస్తామని చెప్పారు. డబ్బులు లేకపోవడంతో ఇంటికి పోయి మళ్లీ ఈ రోజు వచ్చా. నాకు అవసరం లేకున్నా రూ.200 తీసుకొని గ్యాస్ పైపు అంటగట్టారు. ఇటీవలే కొత్త పైపు కొన్నామని చెప్పినా వినలేదు. నాలాంటి పేదవాళ్లను ఇబ్బంది పెట్టకుండా అధికారులు ఏజెన్సీల వారిపై చర్యలు తీసుకోవాలి.

– డి.లక్ష్మమ్మ, మిర్యాలగూడ

సైన్స్ ఫెయిర్‌కు సన్నద్ధం

ఆన్‌లైన్‌లో నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ నిర్ణయం

జనవరి రెండో వారంలో జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్

19 నుంచి 25వరకు 'ఇన్‌స్పైర్ మానక్' అవార్డు ప్రదర్శనలు

విజ్ఞాన శాస్త్రం, సాంకేతిక అభివృద్ధిపై ప్రాజెక్టులకు అవకాశం

వర్కింగ్ మోడల్స్‌కు ప్రాధాన్యం

రామగిరి, డిసెంబర్ 30 : విద్యార్థుల్లో దాగి ఉన్న శాస్త్ర సాంకేతిక (విజ్ఞాన, గణితశాస్త్ర) నైపుణ్యాలను వెలికితీసి వారి ప్రతిభకు పదునుపెట్టే జిల్లా స్థాయి సైన్స్ ప్రాజెక్టులు, ఇన్‌స్పైర్ మానక్ అవార్డు ప్రదర్శనలు ఈ విద్యా సంవత్సరం ఆన్‌లైన్‌లో నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ నిర్ణయించింది. ప్రదర్శనలు ఆన్‌లైన్‌లో చేసేందుకు అవసరమైన అంశాలను సన్నద్ధం చేసేలా జిల్లా విద్యాశాఖ సిద్ధమైంది. సమాజం కోసం సైన్స్ అండ్ టెక్నాలజీ అనే ప్రధాన అంశంతోపాటు ఇన్‌స్పైర్ మానక్ అవార్డులు (2022–23)కు ఎంపికైన 143 ప్రాజెక్టుల ప్రదర్శన ఆన్‌లైన్‌లోనే నిర్వహించనున్నారు. ఇందుకోసం ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ప్రదర్శనకు సూచించిన అంశాల్లో వర్కింగ్ మోడల్స్‌కు ప్రాధాన్యం కల్పించనున్నట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. ఇందులో భాగంగా విద్యార్థులు ప్రాజెక్టులను తయారు చేసి ప్రదర్శన వీడియో పంపించాల్సి ఉంటుంది. జిల్లా స్థాయి ప్రదర్శనలో ఎంపికైన ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి పంపిస్తారు.

ప్రాజెక్టుల ఎంట్రీల నమోదు ఇలా..

ప్రదర్శనలో పాల్గొనే పాఠశాలలు, విద్యార్థులు, ఛాత్రోపాధ్యాయుల వివరాలను జనవరి 8లోగా జిల్లా విద్యాశాఖ జారీ చేసే గూగుల్ ఫారం లింక్‌లో సమర్పించాల్సి ఉంటుంది. ప్రాజెక్టుల తయారీలో ఆయా విద్యాసంస్థల గణిత, సైన్స్ ఉపాధ్యాయులు గైడ్ టీచర్లుగా విద్యార్థులను ప్రోత్సహించి సంసిద్ధం చేసేలా విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. అదేవిధంగా ఇన్‌స్పైర్ అవార్డులు (2022–23)కు ఎంపికైన 143 ప్రాజెక్టుల వివరాలను e-DLEPCలో జనవరి 18లోగా ప్రాజెక్టు ప్రదర్శన వీడియో, ఇతర వివరాలను ఇన్‌స్పైర్ మానక్ కాంపిటేషన్ యాప్‌లో నమోదు చేయాలి. వీరికి జనవరి 19 నుంచి 25 వరకు నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ జూమ్ ద్వారా జిల్లాల వారీగా ప్రదర్శన నిర్వహిస్తారు. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతిని గానీ, 9848578845లో గానీ సంప్రదించవచ్చు.